www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 14 ఫిబ్రవరి 2023

స్పందన వినతులకు పరిష్కారం చూపాలి : కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: స్పందనలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత కాలవ్యవధి లోపల ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలకు అర్థవంతమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ డికె.బాలాజీ, డిఆర్‌ఓ శ్రీనివాసరావు, ఎస్‌డిసిలు కోదండ రామిరెడ్డి, భాస్కర్ రాయుడులు అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. మొత్తం 132 వినతులు రాగా ఇందులో రెవెన్యూ శాఖకు 96, విద్యాశాఖకు 3, జిల్లా పౌరసరఫరాల శాఖకు 1, పోలీస్‌శాఖకు 10, మునిసిపల్ కార్పోరేషన్‌కు 2, పంచాయతీ రాజ్‌కు 8, డిఆర్‌డిఎకు 1, హౌసింగ్‌కు 1, ఎపిఐఐసి 1, డిఎం అండ్ హెచ్‌ఓ 1, పిఓఎస్‌ఎస్‌ఎ 1, ఆరోగ్యశ్రీ 1, ఇరిగేషన్ 1, జాతీయ రహదారులు 1, బిసి కార్పొరేషన్ 1, ఎస్‌సి కార్పొరేషన్ 1, లాండ్ అండ్ సర్వే 2లు వినతులు రావడం జరిగిందన్నారు.

నగరిలో టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేస్తాం..

తమిళనాడు తరహాలో 500 యూనిట్ల ఉచిత విద్యుత్

రోజా పై నారా లోకేష్ పంచ్‌లు

ప్రజాశక్తి- పుత్తూరుటౌన్

తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర సోమవారం ఉదయం నగరి నియోజకవర్గంలోని పుత్తూరు మండలం చిన్నరాజకుప్పం గ్రామం నుంచి ప్రారంభమయ్యింది. రాత్రికి నారాయణవనంలోని వెత్తల తడుకు వద్ద విడిది కేంద్రానికి చేరుకుని బస చేశారు. ఈ సందర్భంగా సాయంత్రం శ్రీద్రౌపది సమేత శ్రీధర్మరాజుల ఆలయ ప్రాంగణంలో సభ నిర్వహించాలని నిర్ణయించారు. అయితే పోలీసులు అనుమతి నిరాకరించడంతో విడిది కేంద్రం వద్దే టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే కేసులు నమోదు చేస్తామని పోలీసులు స్పష్టీకరించడమే కాకుండా కట్టిన ఫ్లెక్సీలను సిఐ లక్ష్మీనారాయణ, ఎస్‌ఐ వెంకట మోహన్ మున్సిపల్ సిబ్బందితో దగ్గరుండి వెనక్కి తిప్పి కట్టించారు. సాయంత్రం నాలుగు గంటలకు నగరి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ గాలి భానుప్రకాష్ ఆధ్వర్యంలో చిన్నరాజకుప్పంలోని విడిది కేంద్రం వద్ద గల మామిడి తోటలోనే బహిరంగ సభను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ మంత్రి రోజాపై పంచ్‌ల వర్షం కురిపించారు. తాను నగరికి వస్తే చీర, గాజులు ఇచ్చిపంపిస్తానని మంత్రి రోజా వ్యాఖ్యానించారని, చీర గాజులు వేసుకున్న వాళ్లు తక్కువేమీ కాదని, అయితే ప్రస్తుతం నగరిలోనే ఉన్నానని కనీసం ఎవరితోనైనా చీరలు గాజులు ఇచ్చి పంపిస్తే వాళ్ళు కాళ్లు మొక్కి చీరలు, గాజులు తాను తీసుకుంటానని ఎద్దేవా చేశారు. జబర్దస్త్ పాపా అని వ్యాఖ్యానించడానికి రోజా ఫీలయ్యారని, మీడియాలో కూడా ఆ విషయంపై ప్రస్తావించారని అయితే ఇకమీదట ఆమె కోరిక మేరకు జబర్దస్త్ ఆంటీ అని పిలుస్తానని వ్యంగాస్త్రం సంధించారు. రోజా తన చెప్పులు మోయడానికి ప్రత్యేకంగా ఓ ప్రభుత్వ అధికారిని నియమించుకున్నదని అన్నారు. బర్డ్‌కి కేక్‌కట్ చేసి చుట్టూ ఉన్నవారికి పంచిపెట్టేటట్లు నగరి నియోజకవర్గంను రెండు ముక్కలుగా చేసి పుత్తూరు, వనమాలపేట మండలాలను, తిరుపతి జిల్లాలోనూ నగరి, నింద్ర విజయపురాన్ని చిత్తూరు జిల్లాలోను విభజించి తాను మంత్రి పదవి ద్వారా లబ్ధి పొందిందని అన్నారు. వడమాలపేటను తన పెద్దన్న కుమారస్వామి రెడ్డికి, పుత్తూరు, విజయపురం, నింద్ర మండలాలను మరో సోదరుడు రాంప్రసాద్ రెడ్డికి, నగరిని తన భర్త సెల్వమనికి, తమ్ముడు రాజాకి పంచిపెట్టి తన కుటుంబానికి మాత్రమే మేలు చేసిందని, నగరికి మొత్తం ఐదు మంది ఎమ్మెల్యేలు ఉన్నారన్నారని ఎద్దేవా చేశారు.

జబర్దస్త్ ఆంటీ నియోజకవర్గంలోని భూములను కూడా జబర్దస్త్‌లా కబ్జా చేసిందని, వడమలపేట టోల్గేట్ వద్ద ఉన్న ప్రభుత్వ భూమి దాదాపు 55 ఎకరాలను, విజయపురం మండలంలోని మహారాజపురం, కోసల నగరంలో దాదాపు 65ఎకరాలను, వడమలపేట మండలం పాదిరేడులోని దళితుల భూములను కబ్జా చేసి మట్టితవ్వేసి అమ్ముకుంటుందని ఆరోపించారు. జగన్మోహన్ రెడ్డి తన లాగానే జిల్లాకు ఒక సైకోని తయారు చేశారని, ఈ జిల్లాకి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనే పెద్ద సైకో ఉన్నాడని, ఈ జిల్లాలో జరిగే ఎర్రచందనం, రేషన్ బియ్యం, లిక్కర్, ఇసుక మాఫియాకి కేరాఫ్ అడ్రస్‌గా ఉన్నాడని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి వచ్చాక నేత కార్మికులను ఆదుకునేందుకు 350యూనిట్ల ఉచిత కరెంట్ అందిస్తానని మాట ఇచ్చి ఈవేళ మాట తప్పాడని అయితే తెలుగుదేశం పార్టీ అధికారంలో వచ్చాక తమిళనాడు తరహాలో 500 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో పాటు నగరిలోనే ఒక టెక్స్టైల్ పార్కును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి పులివర్తి నాని, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, పులిగోరు మురళి, నర్సింహయాదవ్, గంది మాధవయ్య, మాధవ నాయుడు, ధనపాల్, గాలి జీవరత్నం నాయుడు, రవికుమార్, దాదాజీ, చిన్నబాబు నాయకులు పాల్గొన్నారు.

పాదయాత్రలో నారా లోకేష్

'అన్నా' చెరువును కూడా వదలరా..!

- కులాలను అడ్డుపెట్టుకుని 4 ఎకరాలు కబ్జా
- రెవెన్యూ అండతో పెట్రేగుతున్న అక్రమదారులు
- గృహాల పేరుతో గుట్టుచప్పుడుగా వసతులు
- చెరువును కాపాడాలని గ్రామస్తుల ఆవేదన

ప్రజాశక్తి- తిరుపతి సిటి:

తిరుపతి దినదినాభివృద్ధి చెందుతున్న నగరం. ఆధ్యాత్మికంగా ప్రపంచ ప్రసిద్ధిగాంచింది. అదే రీతిలో ఆక్రమాలకు కూడా పేరుగడిస్తోంది. నగరం పరిసరాల్లో భూములు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దీన్ని ఆసరగా తీసుకుని కబ్జాదారులు పెట్రేగిపోతున్నారు. తిరుపతిఅర్బన్ పరిధిలో కాల్వలు, వంకలు, వాగులు, డికెటి స్థలాలు, మఠం భూములే కాదు. ఏకంగా చెరువులను సైతం మింగేస్తుండడం గమనార్హం.

తిరుపతి అర్బన్ పరిధిలో ఇప్పటి వరకు మఠం భూములే లక్ష్యంగా కబ్జాలు జరిగాయి. ఎక్కడ ఖాళీస్థలం కనబడిన అక్రమదారులు పాగా వేసేవారు. ఇప్పటికు కబ్జాదారులు కన్ను నిత్యం నీరందించే చెరువులపై పడింది. ఇప్పడు జిల్లాలోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా శెట్టిపల్లి అర్బన్ పంచాయతీ ప్రతిఒకరి నోటిలో నానుతున్నది. ఆ భూమిని ప్రభుత్వం ల్యాండ్‌పుల్లింగ్ చేసేందుకు చర్యలు తీసుకుంది. దీంతో ఆ చుట్టుపక్కల భూములకు రెక్కలొచ్చాయి. అంతే కబ్జాదారులు కన్ను పరిసరాల ప్రాంతాల్లోని భూములపై పడింది. శెట్టిపల్లి పంచాయతీలోని చెన్నాయగుంట లెక్కదాఖలలో సుమారు 150సంవత్సరాలు పైగా వ్యవసాయాధిరితపై ఆ గ్రామ ప్రజలు 'అన్నా చెరువు' ఆయకట్టును నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. సుమారు 200 ఎకరాలకుపైగా పంటలు పండించేందుకు ఈ చెరువే దిక్కు.

తిరుపతి అర్బన్ మంగళం లెక్కదాఖలాలు సర్వే నెంబరు 85లో అన్నా చెరువు ఉంది. 1985లో కొంత మంది కబ్జారాయుళ్లు దీన్నిపై కన్నేశారు. ఏకంగా రోడ్డు వేశారు. గ్రామస్తులు అప్రమత్తమై వారిని ఖాళీ చేయించారు. 1995లో ఈ చెరువును కొంతమంది పలుకుబడి కల్గిన వ్యక్తులు కబ్జా చేసి గుడిసెలు వేయించారు. గ్రామస్తులు స్పందనతో శెట్టిపల్లి పంచాయతీ ప్రజల అండతో కబ్జాదారులను తరిమివేశారు. సర్వే నెంబరు 85లోని 80 ఎకరాలు విస్తర్ణం కల్గిన చెరువును గ్రామస్తులు కాపాడుకుంటూ వ్యవసాయం చేసుకుంటున్నారు. కానీ ఇటీవల కొంతమంది చెరువులోకి ప్రవేశించి, మూడు వైపుల అక్రమాలకు తెరతీశారు. ఆ ప్రాంతాల్లో కొన్ని తాత్కాలిక ఇండ్లు నిర్మించి, పోర్చరీ డాక్యూమెంట్లు సృష్టించి, కరెంట్ కనెక్షన్లు, రోడ్లు నిర్మాణం చేపట్టి, వ్యాపార సముదాయులను నిర్మిస్తున్నారు. శ్రీగణపతి వీరభద్ర సహాకార సంగం పేరుతో కొంత మంది కుల సంఘాలను అడ్డుపెట్టుకుని 4 ఎకరాలకుపైగా చెరువు భూమిని అక్రమించారు. ప్రశ్నించిన గ్రామస్తులపై కులాల పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ విషయమై మీడియాలో వచ్చినా పట్టించుకోకుండా రెవెన్యూ అధికారుల అండతో కబ్జాదారులు పెట్రేగిపోతున్నారు. గ్రామస్తులు తమ చెరువును కాపాడాలని జిల్లా రెవెన్యూ అధికారులు చుట్టూ తిరుగుతున్నా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం. దీంతో చేసేది లేక తమ చెరువును కాపాడుకునేందుకు గ్రామస్తులు రెవిన్యూ కార్యాలయాల వద్ద పోరాటాలకు సిద్దమయ్యారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, కబ్జాకు గురవుతున్న అన్నాచెరువు భూములను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెరువును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన దృశ్యం

చెరువునే నమ్ముకుని బతుకుతున్నాం..

మాకు ఊహ తెలిసినప్పటి నుంచి అన్నాచెరువే జీవనాధారంగా బతుకులు సాగిస్తున్నాం. గతకొంత కాలంగా భూముల ధరలు పెరిగిపోవడంతో కొంతమంది అన్నాచెరువు భూములపై కన్నేశారు. కులసంఘాల పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, మాకు న్యాయం చేయాలి.

- ఎద్దల సుబ్రమణ్యం యాదవ్, మాజీ ఎంపిటిసి, చెన్నాయగుంట

ఆ నీరే మాకు ఆధారం

అన్నాచెరువును నమ్ముకుని, ఆ చెరువు నుంచి వచ్చే నీటిపారుదలతోనే మా రైతులు పంటలు పండించుకుని బతుకులు వెలదీస్తున్నాం. ఎంత కరువు వచ్చిన ఈ చెరువు ఎండిపోదు. నీరు సమృద్ధిగా ఉండే అన్నాచెరువును కబ్జాదారులు తమ స్వార్థప్రయోజనాల కోసం మట్టితోలి చెరువును చదును చేస్తూ, పంచాయతీ రైతుల జీవితాలను బుగ్గిచేస్తున్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుని, రైతులకు న్యాయం చేయాలి.

- రాతిగారి కృష్ణయ్య, వార్డు మెంబరు, శెట్టిపల్లి పంచాయతీ

సహకార సంఘాల పేరుతో చెరువును చదును చేస్తున్నారు

కొంత మంది కబ్జాదారులు సహాకార సంఘాల పేరుతో చెరువును చదును చేస్తున్నారు. 80ఎకరాల విస్తర్ణం కల్గిన చెరువులో 5 ఎకరాలకు పైగా కబ్జాదారులు ఆక్రమించుకున్నారు. వారికి కొంత మంది అధికార యంత్రాంగం సహకరించడంతో ఏకంగా కరెంటు కనెక్షన్లు, రోడ్లు సైతం నిర్మించుకున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే అధికారుల అండతో గ్రామస్తులపైకే ఎగబడుతున్నారు. ఇలాంటి వారిని అట్టడి చేసి, తమ గ్రామ చెరువును కాపాడాలి.

- నాగరాజు యాదవ్, రైతు, చెన్నాయగుంట

చెరువు కబ్జా విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లా..

గ్రామంలోని అన్నా చెరువుకబ్జాకు గురైందన్న విషయం తెలుసుకుని చెరువు భూమిని పరిశీలించాను. అక్కడ పరిస్థితులను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. వారి ఆదేశాల మేరకు చెరువు అక్రమాలకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం.

- భూపతి, విఆర్‌వో, చెన్నాయగుంట

కబ్జాదారులపై చర్యలు తీసుకుంటాం

తిరుపతి అర్బన్ మండలం శెట్టిపల్లి పంచాయతీలోని చెన్నయగుంట గ్రామానికి చెందిన అన్నాచెరువు కబ్జాకు గురవుతున్నా విషయం తమ దృష్టికి వచ్చింది. దీన్నిపై చర్యలు తీసుకోవాలని కిందస్థాయి అధికారులకు సూచించాం, గ్రామస్తుల సూచన మేరకు చెరువు హద్దులు సర్వేచేయించి, పెంచింగ్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తాం.

- వెంకటరమణ, తహాశీల్దారు, తిరుపతి అర్బన్ మండలం

కబ్జాకు గురవుతున్న చెరువు

జాతీయ మానవ హక్కుల కమీషన్ సూచించిన

పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి: కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

జాతీయ మానవ హక్కుల కమీషన్ నుంచి అందిన తాగునీటి, విద్యుత్, రోడ్లు వంటి పనులకు అధికారులు ప్రాధాన్యత కల్పించి చేపట్టాలని, ఇప్పటికే చేపట్టిన పనుల వివరాలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ద్వారా జాతీయ మానవహక్కుల కమీషన్‌కు నివేదించాలని జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలను చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ మానవ హక్కుల కమీషన్ నుండి గూడూరు, సూళ్ళూరుపేట రెవెన్యూ డివిజన్ల పరిధిలో రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణాలు ఇప్పటికే చేపట్టామన్నారు. అలాగే తాగునీటికి సంబంధించి మూడు కిలో మీటర్ల పైప్‌లైన్, ఫారెస్ట్ పరిధిలో మూడు ఫేస్‌ఎలక్ట్రిక్ లైన్ ఏర్పాటు, రెండు చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు, చెరువులలో పూడికతీత పనులకు సంబంధించి అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించాలని సూచించారు. జిల్లా కమిటీ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమీక్షలో గూడూరు ఆర్‌డిఓ కిరణ్ కుమార్, సూళ్ళురుపేట ఆర్‌డిఓ చంద్రముని, షార్, సూళ్ళురుపేట డివిజన్ ఫారెస్ట్ అధికారులు, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బి, ఎపి ఎస్‌పిడిసిఎల్ అధికారులు, వాకాడు, డివి.సత్రం, తడ, సూళ్ళురుపేట, చిట్టమూరు తహాశీల్దార్లు హాజరయ్యారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో 'బ్రహ్మోత్సవ శోభ'

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: సద్యోముక్తి క్షేత్రం, దక్షిణ కైలాసమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో బ్రహ్మోత్సవ శోభ సంతరించుకుంది. ఆలయాన్ని, ఆలయ పరిసరాలను విద్యుద్దీపాలంకరణలతో ముస్తాబు చేశారు. శ్రీకాళహస్తి ఆలయంతో పాటు స్వర్ణముఖి నదిలోని రామసేతు వంతెనపై ఏర్పాటు చేసిన మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులు భక్తులను అలరిస్తున్నాయి.

వేడుకగా కన్నప్ప ధ్వజారోహణం

శివుని భక్తుడైన కన్నప్పకు తొలిపూజ గౌరవం దక్కింది. సోమవారం శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. పరమశివుని వరం ప్రకారం బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా సోమవారం కన్నప్పకు ధ్వజారోహణం నిర్వహించారు. మధ్యాహ్నం తర్వాత కన్నప్ప ఉత్సవమూర్తిని అలంకరించి మేళ తాళాలతో కొండపై ఉన్న కన్నప్ప ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. వేదపండితులు, పూజారులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ధ్వజస్తంభానికి దర్భను, వస్త్రాన్ని చుట్టి అలంకరించారు. తర్వాత నైవే ద్యం సమర్పించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో సాగర్ బాబు, స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణి రెడ్డి, బోర్డు సభ్యులు, ఆలయాధికారులు పాల్గొన్నారు.

నేడు స్వామివారి ధ్వజారోహణం

మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వామివారి ధ్వజారోహణం చేస్తారు. ఆలయంలోని స్వామి వారి ద్వజస్తంభం వద్ద పూజలు నిర్వహించి ధ్వజారోహణం నిర్వహిస్తారు. దీనిని దేవరాత్రి అని అంటారు.

వెండి అంబారీల వితరణ

యాక్ట్ ఛానల్ సీఈవోలు మల్లాడి బాలసుబ్రమణ్యం, మల్లాడి నాగేశ్వరరావు దంపతులు స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి రూ.కోటి 36లక్షల విలువచేసే వెండి అంబారీలను సోమవారం వితరణగా తలందజేశారు. దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్ బాబు సమక్షంలో వెండి అంబార్లకు పూజాది కార్యక్రమాలు నిర్వహించి, దాతలు దేవస్థానానికి అప్పగించారు. అనంతరం దాతలను దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగరబాబులు అభినందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. స్వామీ అమ్మవర్ల దర్శనం చేయించారు. ధర్మకర్తల మండలి సభ్యులు సాధనమున్న, నందా నరసింహులు, భాస్కర్, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరి యాదవ్ పాల్గొన్నారు.

20 టన్నుల కూరగాయలు వితరణ

స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి నంద్యాలకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త సి.ప్రసాద్ సోమవారం 20 టన్నుల కూరగాయలను వితరణ చేశారు. స్థానిక ఆలయంలో ప్రతియేటా నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాలకు వ్యాపారవేత్త ప్రసాద్ కూరగాయలను వితరణ చేయడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాది కూడా ఆయన కూరగాయలను ఆలయానికి వితరణ చేశారు. ముక్కంటి భక్తులకు చేసే అన్నదానంలో తన వంతు సాయమందించడం ఆనందంగా ఉందని ప్రసాద్ అన్నారు. ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో సాగర్ బాబు, శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మల్లెంబాకం మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

23 నాటికి ఓటర్ల జాబితా సిద్ధం : కలెక్టర్

ఎమ్మెల్సీ ఎన్నికలపై రాజకీయ పార్టీలతో సమావేశం



ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశంలో కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: పట్టభద్రులు, ఉపాధ్యాయుల స్థానిక సంస్థల ఓటర్లు 1200 దాటిన పోలింగ్ కేంద్రాల్లో ఆక్సలరీ పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటుకు ఉన్న పోలింగ్ స్టేషన్ల ప్రస్తుత పేరును బట్టి పోలింగ్‌స్టేషన్ల పేరు మార్పులు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లో ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశమయ్యారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేటితో ఎంఎల్‌సి ఓటర్ల నమోదు పూర్తవుతుందని, ఇప్పటివరకు అందిన దరఖాస్తులను పరిశీలించి ఈనెల 23వ తేదీ నాటికి జాబితా సిద్ధం చేయనున్నామని, అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు అందించాలని సూచించారు. నేడు వివిధ పార్టీలు అందించిన వినతులను పూర్తిస్థాయిలో పరిశీలించి ఎన్నికల కమీషన్‌కు నివేదించడం జరుగుతుందని డూప్లికేట్ ఓటర్ల తొలగింపు చేపట్టామని వివరించారు. ఈసమావేశంలో సిపిఎం, సిపిఐ ప్రతినిధులు వినతులను అందించారు. మార్చి 13న జరగనున్న పోలింగ్ సమయం వల్ల 1200 ఓట్లు దాటిన పోలింగ్ కేంద్రాలకు అనుబంధ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని వివరించారు. ఈసమావేశంలో తిరుపతి నగరపాలక కమీషనర్ అనుపమ అంజలి, ఆర్‌డిఓలు గూడూరు కిరణ్ కుమార్, సూళ్ళురుపేట చంద్రముని, శ్రీకాళహస్తి రామారావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కోదండ రామిరెడ్డి, శ్రీనివాసులు, ఎఈఆర్‌ఓలుగా ఉన్న తహశీల్దార్లు గూడూరు లీలారాణి, సూళ్ళురుపేట రవికుమార్, వెంకటగిరి పద్మావతి, చంద్రగిరి శిరీష, తిరుపతి వెంకటరమణ, శ్రీకాళహస్తి జరీనా, సత్యవేడు సుబ్రహ్మణ్యం, ఈడిటిలు గూడూరు శిరీష, సూళ్ళురుపేట మస్తానయ్య, వెంకటగిరి అర్చన, చంద్రగిరి మోహన్ రెడ్డి, శ్రీకాళహస్తి ఉషారాణి, సత్యవేడు రవిచంద్ర, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్‌జెడిపై చర్యలు తీసుకోండి

కలెక్టర్‌కు వామపక్షాల వినతి



మార్చి నెలలో జరగనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో అధికార పార్టీ నాయకులు బరితెగించి తప్పుడు పనులకు పాల్పడుతున్నారని, దీనికి అధికార యంత్రాంగం సహకరిస్తున్నదని సిపిఎం, సిపిఐ నేతలు కందారపు మురళీలు, ఎ.రామానాయుడు తీవ్రమైన ఆరోపణలు చేశారు. సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన రాజకీయ పక్షాల సమావేశం వాడివేడిగా జరిగింది. రీజినల్ జాయింట్ డైరెక్టర్ ప్రతాపరెడ్డి వారం రోజుల కిందట తిరుపతి రూరల్ మండలంలోని ఢిల్లీపబ్లిక్ స్కూల్లో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారని, ఆ సమావేశానికి అధికారపార్టీ అభ్యర్థి శ్యాంప్రసాద్ రెడ్డిని ఆహ్వానించి పట్టుపంచలు, పట్టుచీరలు పంపిణీ చేయడం దారుణమని విమర్శించారు. అధికారుల సమక్షంలో అక్రమాలకు పాల్పడుతున్నా, అధికారులు మిన్నకుండినట్టు వ్యవహరించడం అవకతవకల తారస్థాయిని తెలియజేస్తున్నదని నేతలు తీవ్రంగా విమర్శించారు. ఆర్జెడి ప్రతాపరెడ్డి అధికార పార్టీ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారని తక్షణం ఆయన పై కఠినచర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. గత నెల రోజులుగా పశ్చిమ రాయలసీమ, తూర్పు రాయలసీమలో పనిగట్టుకుని అన్ని జిల్లాలలో ఆర్జెడి పర్యటనలు చేస్తూ అధికారపార్టీ అభ్యర్థులను గెలిపించమని కోరుతున్నారని, ఇంతలా బరితెగించి పెద్దల సభకు జరిగే ఎన్నికల్లో గెలవాలా.. అని ప్రశ్నించారు. అధికార పార్టీ నాయకులు బరితెగించి వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టారు. నకిలీ ఓటర్లను గుర్తించి రద్దు చేయడంలో అధికార యంత్రాంగం విఫలమైందని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాకలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ఆర్జెడి ప్రతాపరెడ్డి పాల్గొన్న సమావేశానికి అధికారపార్టీ అభ్యర్థి వచ్చి బహుమతులు పంచినట్టు తమ దష్టికి రాలేదని, దీనిపై సమగ్ర విచారణ జరిపిస్తామన్నారు. తనకు తెలియకుండా ఆర్జెడి జిల్లాలో ప్రవేశించడానికి వీలు లేదని ఉత్తర్వులు ఇస్తామని, తప్పు జరిగి ఉంటే కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు. ఉపాధ్యాయ నియోజకవర్గంలో అనర్హులు 700మంది ఓట్లు నమోదయ్యాయని వచ్చిన ఆరోపణలపై విచారణ జరుపుతామని, అనర్హులవి నమోదై ఉంటే తొలగిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఎన్నికలను పారదర్శంగా నిర్వహించడానికి కషి చేస్తామని అనుమానాలు అవసరం లేదని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ శ్రీనివాసరావు, తిరుపతి మున్సిపల్ కమిషనర్ అనుపమ అంజలి, జిల్లాలోని ఆర్డీవోలు, ఎమ్మార్వోలతోపాటు సిపిఎం నేతలు టి.సుబ్రహ్మణ్యం, జి.బాలసుబ్రమణ్యం, ఆర్.లక్ష్మి, వేణుగోపాల్, మునిరాజ, సిపిఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, నేత రాధాకష్ణ, బిజెపి, వైసిపి తదితర రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం : అడిషనల్ ఎస్పీ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: బాల్యవివాలను అరికట్టాలని అడిషనల్ ఎస్పి జె.వెంకట్రావు పిలుపునిచ్చారు. సోమవారం బాల్యవివాహాల వ్యతిరేకపోరాట సమితి, పరివర్తన సేవా సంస్థ మరియు ప్రజాప్రగతి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా పరిధిలోని అన్ని దళిత గిరిజన గ్రామాలలో, కాలనీలలో మహాశివరాత్రి సందర్భంగా జరిగే బాల్య వివాహాలు నివారించాలని తిరుపతి ఎస్పీ పోలీస్ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ జె.వెంకట్రావు చేతుల మీదుగా వాల్‌పోస్టర్లు ఆవిష్కరించడం జరిగిందని బాల్య వివాహాల వ్యతిరేక సమితి కన్వీనర్ సి.కోటయ్య తెలిపారు. ఏఎస్‌పి వెంకట్రావు మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు గుర్తించినట్లయితే పోలీస్ నెంబర్ 100కు, చైల్డ్ లైన్ నెంబర్ 1098కు చేసి సమాచారం ఇవ్వాలని విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పరివర్తన సేవా సంస్థ అధ్యక్షులు పల్లం అమర్నాథ్, సెంటర్ ఫర్ డెవలప్మెంట్ సొసైటీ డైరెక్టర్ ఆర్ఎస్.చంద్రశేఖర్, సీనియర్ జర్నలిస్ట్ పి.నాగరాజు, పి.దేవేంద్ర, కష్ణవేణి, లక్ష్మీదేవి, శ్రీనివాస్, కట్టమంచి చలపతి, మార్కండేయ రెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అడ్డుకోండి: సిడిపిఓ

శ్రీకాళహస్తి: బాల్యవివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని శ్రీకాళహస్తి ఐసీడీఎస్ సీడీపీవో శాంతిదుర్గ పిలుపునిచ్చారు. స్థానిక సరస్వతి భాయ్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవంలో బాల్య వివాహాలు అధికంగా జరిగే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో బాల్య వివాహాల నిరోధంపై ఐసిడిఎస్ సిబ్బంది పోలీస్, రెవెన్యూ సిబ్బంది సాయంతో గ్రామాలకు వెళ్లి బాల్యవాహాల నిర్మూలనపై అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను వివరించాలన్నారు.

డప్పు కళాకారులకు రూ.5 వేలు పింఛను అందించాలి

ప్రజాశక్తి-సత్యవేడు: రాష్ట్ర వ్యాప్తంగా డప్పు కళాకారులకు రూ.5 వేలు సామాజిక పింఛను రూ.5 వేలు ఇవ్వాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దేశాండీ అరుణాచలం తెలిపారు. సోమవారం శిరనంబూదూరులో డబ్బు కళాకారుల సమావేశం జరిగింది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేవీపీస్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేవీపీస్ సంఘం సాధించిన విజయాలు, వాటి అమలు, అనుసరిస్తున్న విధానాలపై చర్చించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ప్రభుత్వాలు సక్రమంగా మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా దళితులకు సామాజిక న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డప్పు కళాకారులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం కమిటీని ఏర్పాటు చేశారు. డప్పు కళాకారుల సంఘం అధ్యక్షుడిగా షణ్ముగం, ఉపాధ్యక్షుడిగా అల్లాస్వామి, కార్యదర్శిగా ధనుంజయులు, ఉప కార్యదర్శిగా గోపాల్, కోశాధికారిగా వెంకటేశులు, కమిటీ సభ్యులుగా జయరాం, మణి, వాణి సుబ్రహ్మణ్యం తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అమ్మవారికి తాళిబొట్టు సమర్పణ

ప్రజాశక్తి-గూడూరు: కుందకూరు గ్రామాల పరిధిలో కనుమరాయకొండపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి టీటీడీ మాజీ ఛైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పెద్ద అల్లుడు నిడదవోలు నియోజకవర్గం ఎమ్మెల్యే(వైసిపి) శ్రీనివాస్ కుటుంబ సభ్యులు, చిన్న అల్లుడు భార్య పిల్లలు, అలాగే చిన్న కుమార్తె, చిన్నల్లుడు కుటుంబం స్వామి వారి దర్శనం చేసుకోవాలని వచ్చారని, మనవరాలు కల్యాణం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. అమ్మవారికి బంగారు తాళిబొట్టును సమర్పించామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అభివద్ధి ప్రదాత, ప్రముఖ పారిశ్రామికవేత్త బత్తల సుబ్బారెడ్డి, కుందుకూరు సర్పంచ్ ఇనమల శీనయ్య, ఆలయ నిర్వాహకులు, కందుకూరు, అలిమిలి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా చార్లస్ డార్విన్ జయంతి

ప్రజాశక్తి-రేణిగుంట: జీవ పరిణామ సిద్ధాంతాన్ని కనుగొన్న మహనీయుడు 'చార్లస్ డార్విన్' జయంతిని సోమవారం విద్యా వికాస వేదిక ఆధ్వర్యంలో రేణిగుంట బాలుర ఉన్నత పాఠశాల, బీసీ హాస్టల్‌లలో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో వెంకటరమణ, లావణ్య, విజయ, ఐద్వా నాయకులు సత్యశ్రీ, శివానందం, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని వెలుగు ఏపీఎం ఇందిర అన్నారు. సోమవారం స్థానిక మహిళా మండల సమైక్య కార్యాలయంలో మహిళల రక్తహీనతపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో త్రివిక్రమ రావు మహిళలకు రక్తహీనత సాధారణంగా ఉంటుందని.. దీంతో మహిళల్లో ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. రక్తహీనతను తగ్గించుకునేందుకు రోజూ గుడ్డును ఆహారంలో తీసుకోవాలని సూచించారు. సోమవారం ఉదయం బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో ప్రభుత్వం మంజూరు చేసిన పెరటి కోళ్ల పెంపకం కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు పెరటి కోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, మండల మహిళా సమాఖ్య భారతి, గురవమ్మ, లక్ష్మమ్మ, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో అవకతవకలు అరికట్టాలి

ప్రజాశక్తి-రేణిగుంట: మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు లిస్టులో అవకతవకలు అరికట్టాలని మండల తహశీల్దారు కార్యాలయ ఏఎస్‌వో శేఖర్‌కు సోమవారం రేణిగుంట సీపీఎం మండల కమిటీ నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు వెంకటరమణ మాట్లాడుతూ రేణిగుంటలోని పలు పోలింగ్ స్టేషన్లను పరిశీలించామని.. నకిలీ ఓటు వేయడానికి అవకాశం లేకుండా చూడాలని కోరారు. డిగ్రీ అర్హత ఉన్నప్పటికీ మరికొందరిని తొలగించి ఉన్నారని.. కారణం ఓటు నమోదు చేసుకున్న వారికి తెలపాలని, ఓటరు లిస్టులో ఒకరి పేరుతోనే 2 ఓట్లు ఉన్నా.. తొలగించపోవడం అధికారుల నిర్లక్ష్యమన్నారు. ఇప్పటికైనా ఓటర్ లిస్టును మండల ఉన్నత అధికారులు పరిశీలించి అవకతవకలను సవరించాలని కోరారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి-డక్కలి: స్థానిక పోలీస్ స్టేషన్‌ను గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పోలీసులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకాలతో రూ.40 లక్షలు స్వాహా..!

- అవినీతిలో వీవో చల్లా లక్ష్మి చేతివాటం
- పోలీసులకు సమాచారం అందించినా చర్యలు శూన్యం
- ఏపీఎం, సీసీలు, ఏసీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి-గూడూరు : తమ పొదుపు సంఘాల నుంచి వీవో లీడర్ చల్లా శ్రీలక్ష్మి చేతివాటం చూపి సుమారు రూ.40 లక్షల వరకు స్వాహా చేసిందని.. అధికారులు, పోలీసులకు తెలిపినా పట్టించుకోవడం లేదని సోమవారం గూడూరు మండలం చెన్నూరు గ్రామానికి చెందిన 6వ సంఘ బంధంలోని ఎస్సీ, ఎస్టీ పొదుపు సంఘాల మహిళలు స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. తమ వద్ద సంతకాలు సేకరించి తెలియకుండానే అవినీతికి పాల్పడి స్వాహా చేశారని వాపోయారు. బ్యాంకులో రూ.40 లక్షలు రుణం తీసుకొని అందులో రూ.7.20 లక్షలు మాత్రమే గ్రూపు సభ్యులకు చెల్లించారని..మిగిలిన రూ.32.80 లక్షలు వీవో లీడర్ చల్లా లక్ష్మి స్వాహా చేసిందని..ఈ విషయమై చల్లా శ్రీలక్ష్మిని ఆరో సంఘ బంధంలోని గ్రూపు సభ్యులందరూ నిలదీయడంతో కనిపించకుండా పారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీఎం బుజ్జమ్మకు అర్జీ అందించినా పట్టించుకోవడం లేదని.. నాలుగు రోజుల క్రితం వీవో లీడర్ చల్లా లక్ష్మి భర్త మురళీని సభ్యులందరూ కలిసి గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్లో ఎస్సైకి అప్పగించి కేసు నమోదు చేయమని కోరామన్నారు. అయితే అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా వదిలేశారని తెలిపారు. పొదుపు డబ్బులు స్వాహా విషయంలో గూడూరు ఏపీఎం బుజ్జమ్మ, సీసీలు నరసింహులు, దశరథ రామయ్య, ఏసీ వెంకట్రావులకు బాగం ఉందని.. వారిని విచారించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంపూర్ణమ్మ, మల్లేశ్వరి, వరలక్ష్మి, లీలావతి, మాధవి, రత్నమ్మ, రాధిక, లలిత, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

రుణాల మంజూరు వివరాలను చూపుతున్న సభ్యురాలు

రిపబ్లిక్ డే వేడుకల్లో తిరుపతి క్యాడెట్‌ల ప్రతిభ

ప్రజాశక్తి-క్యాంపస్: గత జనవరి 26న డిల్లీలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఈక్వెస్ట్రియన్ ఈవెంట్‌లలో తిరుపతికి చెందిన రైడర్స్ మెరుగైన ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా తిరుపతి యూనిట్ కమాండింగ్ అధికారి కల్నల్ ఎన్. ప్రకాష్ కుమార్ మాట్లాడుతూ ఎన్‌సీసీ 2 (ఏ) ఆర్, వీఆర్ ఈజిటి తిరుపతికి చెందిన నలుగురు క్యాడెట్‌లు ఏపీ, టీఎస్ డైరెక్టరేట్ ఎన్‌సీసీకి రిపబ్లిక్ డే పరేడ్–2023 ఈక్వెస్ట్రియన్ ఈవెంట్‌లలో ప్రాతినిధ్యం వహించారని చెప్పారు. ఇందులో ఎన్‌సీసీ తిరుపతికి చెందిన నలుగురు క్యాడెట్‌లు ప్రశంసనీయమైన ప్రదర్శన ఇచ్చారని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ కోసం 5 పతకాలను గెలుచుకున్నారని తెలిపారు. ఇందులో ఎస్జిటి లో జి.ప్రవల్లిక – బంగారు పతకం (అనుభవం లేని హాక్స్), జేయూవో టి.శివ ప్రసాద్ –రజత పతకం (అనుభవం లేని అబ్బాయిల టెంట్ పెగ్గింగ్), ఎస్జిటి విభాగంలో ఎమ్ కే. నందిని – కాంస్య (వెటర్న్ గర్ల్స్ హ్యాక్స్), ఎస్ యు ఒ విభాగంలో వై. వినోద్ కుమార్ రెడ్డి – 2 కాంస్య (వెటర్న్ బాయ్స్ డ్రెస్, వెటర్న్ బాయ్స్ హ్యాక్స్ విభాగంలో పతకాలు సాధించారని, ఇది తిరుపతి యూనిట్ కు ఎంతో గర్వంగా ఉందన్నారు. ఇందులో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ప్రశంసనీయమైన విజయాలు సాదించినందుకు క్యాడెట్‌లను ఆదివారం యూనిట్‌లో కమాండింగ్ అధికారి కల్నల్ ఎన్ ప్రకాష్ కుమార్ పతకాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీటీఓ లు పురుషోత్తంనాయుడు, సుధీర్, యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఔత్సాహికులకు అంకుర సంస్థల శిక్షణ

ప్రజాశక్తి-క్యాంపస్: ఔత్సాహికులకు అంకుర సంస్థల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం కులసచివులు డాక్టర్ రజనీ పిలుపునిచ్చారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో అమలవుతున్న అగ్రి బిజినెస్ ఇంక్యుబేటర్ ద్వారా ఎంపికైన ఐదో బ్యాచ్ ఔత్సాహితులకు శిక్షణ కార్యక్రమాన్ని డాక్టర్ శంకర్ రెడ్డి సమావేశ మందిరంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంకల్పం, సమృద్ధి కార్యక్రమాల తో ఔత్సాహికుల ఆవిష్కరణలను వెలుగులోకి తీసుకొచ్చి వారికి శిక్షణ కార్యక్రమంతో పాటు ఆర్థిక సహకారం అందించి నూతన అంకుర సంస్థలను ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తోడ్పాటును అందిస్తారని ఆమె తెలిపారు. రార్స్ సంచాలకులు డాక్టర్ సి. రమణ మాట్లాడుతూ ప్రపంచంలోనే ఎక్కువ యువత కలిగిన మన భారతదేశం నుంచి ఎక్కువ అంకుర సంస్థలు రావాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఔత్సాహికులు ఈ రెండు నెలల శిక్షణతో పాటు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలోని వివిధ వనరులను సద్వినియోగం చేసుకొని అంకుర సంస్థలను మరింత అభివృద్ధి చేసుకోవాలని కోరారు. డాక్టర్ పి.బాల హుస్సేన్ రెడ్డి ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ 2019 నుంచి ఇంక్యుబేటర్ సాధించిన ప్రగతిని వివరించారు. ఫిబ్రవరి 13 నుంచి 17వ తేదీ వరకు పరిశోధన స్థానంలో ప్రత్యక్షంగా ఫిబ్రవరి 18 నుంచి మార్చి 5వ తేదీ వరకు ఆన్లైన్ క్లాసులు మొత్తం 90 గంటలు శిక్షణ కార్యక్రమంలో అంకుర సంస్థ స్థాపన మొదలుకొని వ్యాపార లావాదేవీలు ఎలా నిర్వహించాలి, ఆర్థిక అంశాలు, జీఎస్టీ, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్మెంట్, మార్కెటింగ్, అడ్వర్టైజ్మెంట్, ప్యాకింగ్, డిజిటల్ మార్కెటింగ్ మొదలగు అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు డాక్టర్ బాలహుస్సేన్‌రెడ్డి తెలిపారు. ఇంతవరకు నాలుగు బ్యాచ్‌లకు 42 మందికి రూ.2.88 కోట్లు గ్రాంట్ విడుదల చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ ప్రభాకర్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, పాండిచ్చేరి, కర్ణాటక, తమిళనాడుకు చెందిన 32 మంది ఔత్సాహికులు, ఇంక్యుబేటర్ సిబ్బంది నరేష్‌రెడ్డి, లక్ష్మీ తులసి, సంతోష్, రమాదేవి, పరిశోధనస్థాన శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

మహిళల తక్షణ రక్షణకు టోల్‌ఫ్రీ నంబర్లు

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం మహిళల రక్షణ కోసం ఉన్న టోల్ ఫ్రీనంబర్లు, మొబైల్ యాప్స్‌పై తాటితోపు వద్ద వెంకటపతి నగర్‌లో ఎస్ఎస్‌జీ ఉమెన్‌కు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్రం రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ కోనప్రభ మహిళల రక్షణకై ఉన్న వివిధ టోల్ ఫ్రీ నంబర్లు ఏపీ పోలీస్ సేవ యాప్, దిశ యాప్, 112 మొబైల్ యాప్ గురించి మహిళలకు అవగాహన కల్పించారు. రోజూ బాలికలు, మహిళలపై లైంగిక వేధింపులు, దాడులు పెరిగిపోతూ ఉండటం బాధాకరం అన్నారు. మహిళల రక్షణకై ఉన్నటువంటి టోల్ ఫ్రీ నంబర్లు, మొబైల్ యాప్స్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కోవడం చాలా అవసరం అన్నారు. మహిళలు అకస్మాత్తుగా ఇబ్బందులలో పడిన తాము ప్రమాదంలో ఉన్నామని.. అనుమానం వచ్చిన వెంటనే భయాందోళనకు గురికాకుండా అప్రమత్తంగా వ్యవహరించి టోల్ ఫ్రీ నెంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్ర సిబ్బంది డాక్టర్ ఎం. ఇంద్రాణి, డాక్టర్ ఎం. సుచరిత పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మెరుగైన జీవితం

ప్రజాశక్తి-క్యాంపస్: ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడంతో పాటు ఆధ్యాత్మిక చింతన పెంచుకోవడం ద్వారా మరింత మెరుగ్గా జీవితాన్ని సాగించవచ్చని టీడీడీ జేఈవో సదా భార్గవి తెలిపారు. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో టిటిడి ఉద్యోగులకు జీవనశైలి రుగ్మతలు, వ్యాధులు అనే అంశంపై మూడు రోజుల పాటు జరిగిన అవగాహన సదస్సు సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జెఈఓ మాట్లాడుతూ అన్నమయ్య ఒక సంకీర్తనలో పేర్కొన్న విధంగా పుట్టడం, మరణించడం ఖాయమన్నారు. టిటిడి యాజమాన్యం ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ఇలాంటి అవగాహన సదస్సులు భవిష్యత్తులో మరిన్ని నిర్వహిస్తామని తెలియజేశారు. ప్రస్తుతం దాదాపు రెండు వేల మంది పురుష ఉద్యోగులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించామని, మిగిలిన ఉద్యోగులకు త్వరలో మరో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. టాటా క్యాన్సర్ ఆసుపత్రి మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ పి.నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మన శరీరంలో ఒక క్రమ పద్ధతిలో ఉన్న కణాల్లో మార్పులు జరిగి అస్తవ్యస్తంగా మారడాన్నే క్యాన్సర్ అంటారని చెప్పారు. పురుషుల్లో ప్రధానంగా నోరు, గొంతు, ఊపిరితిత్తులు, జీర్ణకోశం, మూత్రాశయం, కిడ్నీలు, ప్రోస్టేట్, మెదడు క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉంటాయని తెలిపారు. శ్రీ పద్మావతి చిన్నపిల్లల హదయాలయ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథరెడ్డి మాట్లాడుతూ తల్లి జన్మనిస్తే అవయవ దానం పునర్జన్మనిస్తుందని చెప్పారు. ఆరోగ్యవంతులుగా ఉండి ఏదైనా కారణంగా బ్రెయిన్ డెడ్ అయినవారు గుండె, కిడ్నీలు, కార్నియా దానం చేయవచ్చున్నారు. అవయవ దానం పైన ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి ప్రాణాలు కాపాడవచ్చని వివరించారు. ఏపీ జీవన్ దాన్ అనే ప్రభుత్వ సంస్థ ద్వారా అవయవదానానికి నమోదు చేసుకోవచ్చని తెలియజేశారు. టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయలో ఒక సంవత్సరం వ్యవధిలోనే వెయ్యికి పైగా గుండె ఆపరేషన్లను నిర్వహించామని తెలిపారు. నిరుపేద కుటుంబాల వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఈ ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నామని, ఈ ఆస్పత్రి గురించిన సమాచారాన్ని అందరికీ తెలియజేయాలని కోరారు. తిరుపతికి చెందిన ప్రముఖ వైద్యురాలు డాక్టర్ కృష్ణప్రశాంతి మాట్లాడుతూ మంచి జీవనశైలి, ఆహారపు అలవాట్లతో మంచి ఆరోగ్యం అలవడుతుందని, తద్వారా మంచి కుటుంబం, మంచి సమాజం ఏర్పడతాయని చెప్పారు. వ్యాధులు వచ్చినంత మాత్రాన భయపడిపోవాల్సిన అవసరం లేదన్నారు. వెల్నెస్ కన్సల్టెంట్ దీప్తి మాట్లాడుతూ 80 శాతం ఆరోగ్య సమస్యలకు ఒత్తిడే ప్రధాన కారణమని, మానసిక ప్రశాంతత అత్యంత ముఖ్యమని తెలిపారు. ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా ముద్ర గల ఆహార ఉత్పత్తులను మాత్రమే వినియోగించాలని సూచించారు.

ఆకట్టుకున్న తిరుచ్చి శంకరన్ మృదంగ విన్యాసం

ఎస్వీ సంగీత నత్య కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రపంచ ప్రఖ్యాత మదంగ వాద్య విద్వాంసులు, కెనడాలోని టొరెంటోలో గల యార్క్ విశ్వవిద్యాలయం ఆచార్యులు డా.తిరుచ్చి శంకరన్(81) మదంగ లయ విన్యాసం టిటిడి ఉద్యోగులను ఎంతగానో ఆకట్టుకుంది. శంకరన్ మాట్లాడుతూ మెదడుకు సంబంధించిన సమస్యలు ఉన్నవారికి మ్యూజిక్ థెరపీ ఉపశమనం కలిగిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో శ్వేత డైరెక్టర్ ప్రశాంతి, ఇఇలు జగన్మోహన్ రెడ్డి, నరసింహమూర్తి, శ్రీహరి, డెప్యూటీ ఈఓ గోవిందరాజన్, డిఈఓ భాస్కర్ రెడ్డి, డిఎఫ్ఓ శ్రీ శ్రీనివాస్, ఎస్వీ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు తలకోనలో ఏర్పాట్లు

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన తలకోన శ్రీసిద్దేశ్వరస్వామి వారి మహాశివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని తలకోన ఆలయం పరిసరాలు వైభవంగా ముస్తాబవుతున్నాయని.. ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామని ఈవో జయకుమార్ తెలిపారు. ఫిబ్రవరి 15 నుంచి 19వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలకు భక్తులు స్వామి వారి దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వస్తారని.. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు క్యూలైన్లు ఇతర ఏర్పాట్లు చేస్తున్నారు.

16 నాటికి ఓటర్ల జాబితా పరిశీలన పూర్తిచేస్తాం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: మండలి ఓటరు నమోదు దరఖాస్తులను స్వీకరణ నేటితో ముగించనున్నామని, పరిశీలనకు సంబంధించి ఈ నెల 16వ తేదీ లోపు పూర్తిచేస్తామని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు వివరించారు. సోమవారం సాయంత్రం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అమరావతి నుంచి అన్ని జిల్లాల డిఆర్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా తిరుపతి కలెక్టరేట్ నుండి డిఆర్‌ఓ పాల్గొన్నారు. డిఆర్‌ఓ వివరిస్తూ నేడు రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగిందని, పోలింగ్ కేంద్రాల పేర్లు మార్పు, ఆక్జలరీ (అనుబంధ) పోలింగ్ కేంద్రాల జాబితా సిద్ధమైందని మంగళవారం చిత్తూరు జిల్లా కలెక్టర్, ఆర్‌ఓ వారికి సమర్పించనున్నామని తెలిపారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఓటర్లకు సంబంధించి 639 పరిశీలన చేయాల్సి వుందని, సిఇఓ నిర్దేశించిన మేరకు ఈనెల 16 నాటికి పూర్తిచేస్తామని వివరించారు. ఈనెల 14,15న సిఇఓ వారు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇవ్వనున్న మాస్టర్ ట్రైనర్‌ల శిక్షణ పూర్తి అయిన వెంటనే జిల్లాలో ఈఆర్‌ఓలకు, పిఓల, ఒపిఓల శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎఒ సుబ్రమణ్యం, ఎన్నికల తహశీల్దార్ పరమేశ్వర స్వామి , సిబ్బంది పాల్గొన్నారు.

ఏడు గ్రావెల్ లారీలు స్వాధీనం

ప్రజాశక్తి-సత్యవేడు: మండల పరిధిలోని గ్రావెల్ క్వారీల నుంచి సరైన అనుమతులు(రికార్డులు)లేకుండా వెళు న్న ఏడు గ్రావెల్ లారీలను ఏడీ మైనింగ్ అధికారి ప్రకాష్‌కుమార్ సోమవారం స్వాధీనం చేసుకున్నారు. చెన్నేరి గ్రామం వద్ద మైన్స్ అధికారులు తనిఖీ నిర్వహించి స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించారు.

యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ కావాలి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ కావాలని తిరుపతి జిల్లా యానాదుల సంఘం ప్రధాన కార్యదర్శి చెంచయ్య కోరారు. నారా లోకేష్ పాదయాత్రలో పుత్తూరు పట్టణానికి విచ్చేసిన సందర్భంగా యానాదుల సంఘం కలిసి ఆయనకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఆరేటమ్మ కాలనీ మహిళలు, యువకులు పాల్గొన్నారు.

మండల కోకన్వీనర్‌గా నాగార్జున

ప్రజాశక్తి-కోట: కోట మండల వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్‌గా వేనాటి సాయికిషోర్‌రెడ్డి, మండల కో కన్వీనర్లుగా గోపి, సాయికష్ణా రెడ్డి, నాగార్జున, పేర్నాటి.కిరణ్‌లను నియమించారు. వీరిని పలువురు అభినందించారు.

నిరాశ్రయులకు అన్నదానం

ప్రజాశక్తి-గూడూరు రూరల్ : శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ శ్యామసుందరరావు ఆధ్వర్యంలో గూడూరు పట్టణం గమళ్ళపాలెంలోని మెప్మా, మున్సిపాలిటీ సౌజన్యంతో నిర్వహిస్తున్న మైఫ్రెండ్స్ అసోసియేషన్ వసతి గృహంలోని నిరాశ్రయులకు సోమవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో కేర్ టేకర్ రమేష్ పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలపై వినతి

ప్రజాశక్తి- తొట్టంబేడు: వీఆర్‌ఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం తొట్టంబేడు తహశీల్దార్ సుధీర్‌రెడ్డికి వీఆర్‌ఏల సంఘ అధ్యక్షుడు అంకయ్య, ఉపాధ్యక్షురాలు భవాని ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పలువురు వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

17న దళిత గిరిజన జేఏసీ సదస్సు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన 27 ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అభివృద్ధి పథకాలను పునరుద్ధరించాలని, ఎస్సీ, ఎస్టీల ప్రత్యేక హక్కులు రాజ్యాంగబద్ధంగా చట్టాలను సక్రమంగా అమలుపరిచాలని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ఆర్డినెన్స్, ఎస్సీ, ఎస్టీల సమగ్రాభివృద్ధి నిధి చట్టంగా మార్పు చేయాలనే డిమాండ్లతో ఈ నెల 17న తిరుపతి నగర పరిధిలోని గంధమనేని శివయ్య భవన్ వేదికగా దళిత గిరిజన జేఏసీ రాయలసీమ సదస్సును నిర్వహిస్తున్నట్లు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత అధ్యక్షులు పి. అంజయ్య తెలిపారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, గిరిజనులను కేవలం ఓటర్లుగానే పరిగణిస్తూ వారికి రాజ్యాంగబద్ధంగా కల్పించబడిన హక్కులను అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు సొంత పథకాలను రూపొందించి క్రమేపి హక్కులను, అభివృద్ధిని నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. సమావేశంలో ఏపీ యానాదుల సంఘం అధ్యక్షుడు చందమామల కోటయ్య, గిరిజన జేఏసీ ఛైర్మన్ కృష్ణవేణి, గోవిందయ్య, లక్ష్మి, సుబ్రహ్మణ్యం, రామచంద్రయ్య, అమర్నాథ్, ప్రసాద్ రావు, గిరి తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై సర్వే పూర్తి

ప్రజాశక్తి-దొరవారిసత్రం: దొరవారిసత్రం జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం కింద రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన 'స్పర్శ' సర్వే సోమవారంతో ముగిసింది. పీహెచ్‌సీ పరిధిలోని ఎనిమిది సచివాలయాల గ్రామాల్లో ఆశ వాలంటీర్ల ద్వారా సర్వే చేపట్టారు. సోమవారం ముగింపు కార్యక్రమంలో డివిజనల్ పారామెడికల్ ఆఫీసర్ మోహన్‌రావు, కొల్లు, కట్టువపల్లి గ్రామాల్లోని అనుమానితులను పరీక్షించగా కట్టుపల్లి గ్రామంలో ఓ మహిళకు వ్యాధి ప్రారంభ దశలో ఉన్నట్లు గుర్తించారు. ఆమెకు వెంటనే ఎండీటీ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సంపూర్ణమ్మ, స్పర్శ కార్యక్రమం నోడల్ ఆఫీసర్ మైథిలి, పీహెచ్ ఎన్ పద్మావతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల్లో పుట్టుకతో లోపాల గుర్తింపు

ప్రజాశక్తి-దొరవారిసత్రం: దొరవారిసత్రం పీహెచ్‌సీ పరిధిలోని నెలబల్లి గ్రామంలో సోమవారం 'విలేజ్ డాక్టర్' వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి పద్మావతి రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అనంతరం నెలబల్లి పాఠశాలలో విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలతో శరీరంలో పుట్టుకతో వచ్చిన లోపాలు, అనుకోని పరిస్థితుల్లో ఏర్పడిన అంగవైకల్యాలపై పరీక్షలు నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పి తస్లీమ్, హెల్త్ అసిస్టెంట్ విజయకుమార్, సచివాలయం ఏఎన్ఎం రమణమ్మ, ఆశ కార్యకర్త సుదర్శన, పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం వాసవి పాల్గొన్నారు.

ఆమ్‌ఆద్మీ యూత్ కన్వీనర్‌గా సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: ఆమ్‌ఆద్మీ పార్టీ తిరుపతి జిల్లా యూత్ కన్వీనర్ సూర్య ప్రకాష్, సత్యవేడు నియోజకవర్గం ఆమ్‌ఆద్మీ పార్టీ కన్వీనర్‌గా ఎంటెక్ బాబు, సత్యవేడు నియోజకవర్గం యూత్ కన్వీనర్‌గా బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని బంగ్లా తోటకు చెందిన కుంచాల సుబ్రహ్మణ్యాన్ని ఏకగ్రీవంగా సోమవారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తనకు యూత్ కన్వీనర్‌గా అవకాశం కల్పించిన సూర్య ప్రకాష్ , ఎంటెక్ బాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

బాలాయపల్లి ఎంపీడీవోగా స్వరూపారాణి

ప్రజాశక్తి-బాలాయపల్లి: బాలాయపల్లి ఎంపీడీవోగా స్వరూపారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వాకాడు మండలంలో ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న ఆమెను బాలాయపల్లి ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో బాధ్యతలు చేపట్టారు.

రుణాలు వెంటనే రికవరీ చేయాలి

ప్రజాశక్తి-డక్కిలి: పొదుపు మహిళల నుంచి రుణాలను రికవరీ చేయించాలని అడిషనల్ పీడీ ప్రభావతి అన్నారు. సోమవారం మండల వెలుగు కార్యాలయంలో జరిగిన సమావేశంలో అడిషనల్ పీడీ మాట్లాడారు. వెంకటగిరి, బాలయ్యపల్లి తదితర మండలాల కంటే డక్కిలి మండలం వెనుకబడి ఉందని.. సీసీలు, వీవోఏలు పనితీరుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఏపీఎంను హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో తెలిపిన సమాచారాన్ని కింది స్థాయి సిబ్బందికి తెలిపి వెంటనే అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కె.మాధవి, డాక్టర్ దివాకర్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ అధికారి నారాయణస్వామి అధ్యక్షతన మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించారు. 19 మంది పిల్లలకు దృష్టిలోపం ఉన్నట్లుగా గుర్తించారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

ప్రజాశక్తి-కోట: మండలంలో కొక్కుపాడు గ్రామానికి వెళ్లే రోడ్డులో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ధాన్యం లోడ్డుతో వెళుతున్న లారీ ఢీకొంది. ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన సింహాద్రి, పోలయ్య, సుబ్బయ్యలను కోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.